సాక్షి సంగారెడ్డి

శనివారం : 6 : మే : 2023



ముగ్గురి ప్రాణం తీసిన ఓవర్‌టేక్

ఓవర్ టేక్ ముగ్గురి ప్రాణం తీయగా, మరో ఐదుగురిని గాయాలపాలు చేసింది. ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకొని వస్తుండగా ప్రమాదం జరిగింది. 8లో



ప్రమాదకరంగా చెరువు 9లో

నారాయణఖేడ్ మండలం గంగాపూర్‌లోని ర్యాకల్ రిజర్వాయర్ ప్రమాదకరంగా మారడంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ నెగెటివ్



పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 15 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు 13 మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన డీఈఓ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఈఓ వేంకటేశ్వర్లు

సంగారెడ్డి టౌన్: నూతన డీఈఓ వేంకటేశ్వర్లు కలెక్టర్ డాక్టర్ శరత్‌ను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదా పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. కాగా ఈయన మంచిర్యాల జిల్లా డీఈఓగా పని చేశారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

కాంగ్రెస్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న బీజేపీ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): కర్ణాటక రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లిం ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు బజరంగ్‌దళ్‌ను రాష్ట్రంలో నిషేధిస్తామని చెప్పడం సిగ్గుచేటని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యలకు నిరసనగా హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల్లో ముస్లిం ఓటు బ్యాంక్ కోసం కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేక విధానాలను, దేశరక్షణ, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే నిర్ణయాలను తమ పార్టీ మేనిఫెస్టోలో చేర్చడం విచారకరమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, కొండపురం జగన్, సురేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు

సంగారెడ్డి మున్సిపాలిటీ: చౌటకూర్ మండలం కోర్పోల్, బొమ్మారెడ్డి గూడెం గ్రామాల్లో ఉపాధి హామీ పనులను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సీహెచ్ శ్రీనివాస్ రావు శుక్రవారం పరిశీలించారు. నేరుగా పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఎన్ని గంటలు పనిచేస్తున్నారు, కూలీ ఎంత వస్తుంది అని వారిని అడిగి తెలుసుకున్నారు. తక్కువ కూలీ వస్తోందా అని అడగటంతో కనీసం నాలుగు గంటలు పనిచేస్తే కూలీ గిట్టుబాటు అవుతుందని తెలిపారు. కొందరు కూలీలు డబ్బులు రావడం లేదని ఆయన దృష్టికి తేవడంతో ఆధార్ లింక్ ద్వారా వస్తున్నాయన్నారు. ఏ బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ ఉంటే ఆ ఖాతాకు డబ్బులు జమ వుతాయన్నారు. స్వగ్రామాల్లోనే పని కలిస్తున్నందున వంద రోజుల ఉపాధి పొందాలని సూచించారు. ఆయన వెంట మండల ఏపీఓ సంతోశ్, టెక్నికల్ అసిస్టెంట్ ప్రతాప్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ బందయ్య, కృష్ణ ఉన్నారు.

ఆలయాల్లో కాశీ జగద్గురువు ప్రత్యేక పూజలు



కేతకిలో పూజలు చేస్తున్న పీఠాధిపతులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయంలో కాశీపీఠం జగద్గురువు 1008 డాక్టర్ చంద్రశేఖర శివాచార్య మహాస్వామి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం కాశీ జగద్గురువుతో పాటు బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, బిచ్కుంద ఆశ్రమ పీఠాధిపతి సోమలింగ శివాచార్య మహాస్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పాదప్రక్షాళన చేసి జల లింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్దేశ్వర స్వామి, ఆలయ కమిటీ చైర్మన్ నీల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం

- 7.26 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా
- గత ఏడాది కంటే 13 వేల ఎకరాలు అధికం
- కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిన వ్యవసాయశాఖ



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రానున్న వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 7.26 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. గత ఏడాది సాగు విస్తీర్ణం కంటే సుమారు 13 వేల ఎకరాలు అధికంగా పంటలు సాగవుతాయని భావిస్తోంది. గత ఏడాది వానాకాలం సీజనులో 7.13 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఈ సాగు విస్తీర్ణం అవసరం మేరకు ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని భావిస్తోంది. ఈ మేరకు వానాకాలం సీజనుకు సంబంధించి వ్యవసాయశాఖ ప్రణాళికను సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

పెరుగనున్న పత్తి, సోయాబీన్ విస్తీర్ణం

- ఈసారి పత్తి పంట సాగు విస్తీర్ణం స్వల్పంగా పెరిగే అవకాశాలున్నట్లు వ్యవసాయశాఖ గుర్తించింది. గత ఏడాది 3.46 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగుకాగా, ఈసారి 3.53 లక్షల ఎకరాలకు పెరిగే అవకాశాలున్నట్లు బావిస్తోంది. అదనంగా ఏడు వేల ఎకరాలు పెరిగే అవకాశం ఉంది.
- అలాగే సోయాబీన్, కంది పంటల సాగు విస్తీర్ణం కూడా కొంత మేరకు పెరుగుతుందని భావిస్తోంది. ప్రధాన పంట వరి సాగు విస్తీర్ణంలో పెద్దగా తేడా ఉండే అవకాశాలు కనిపించడం లేదు. ఈసారి కూడా 1.41 లక్షల ఎకరాల మేరకు వరి సాగు ఉంటుందని అంచనా కొచ్చింది.

ఈసారీ సబ్సిడీ విత్తనాలు లేనట్లే..

- ఈ వానాకాలం సీజన్‌లో కూడా సబ్సిడీ విత్తనాలు పంపిణీ ఉండే అవకాశం లేదు. గతంలో వరితో పాటు వివిధ రకాల విత్తనాలను సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేస్తుంది.
- అయితే గత కొంత కాలంగా ఈ సబ్సిడీ విత్తన పంపిణీ చేపట్టడం లేదు. భూసారాన్ని పెంచే జీలుగ, జనుము విత్తనాలను మాత్రమే సబ్సిడీపై అందిస్తోంది.

41 వేల మెట్రిక్ టన్నుల యూరియా

- ఈ వానాకాలం సీజన్ మొత్తానికి 41,722 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని వ్యవసాయశాఖ అంచనాకు వచ్చింది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆయా నెలల్లో అవసరమైన ఎరువుల అవసరాలకు సంబంధించిన నివేదికను కూడా సిద్ధం చేసింది.
- సీజన్‌లో యూరియా కొరత రాకుండా బఫర్ నిల్వలు అందుబాటులో ఉంచాలని భావిస్తోంది. అలాగే డీఏపీ 15,977 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 19,657 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 36,648 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 9,132 మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరం ఉంటుందని ప్రణాళికను సిద్ధం చేసింది.
- ఈ మేరకు ఆయా నెలల్లో ఎంత మేరకు నిల్వలు ఉంచాలనేదానికిపై కసరత్తు చేస్తోంది.

ఈ నెలాఖరులో పనులు ప్రారంభం

- సాధారణంగా మే చివర, జూన్ మొదటి వారం నుంచి పనులకు శ్రీకారం చుడుతుంటారు. మృగశిర కార్తె తర్వాత దుక్కులు దున్నుకుంటారు. కొన్ని మండలాల్లో ముందుగానే విత్తనాలు వేసుకుంటారు.
- రాయ్‌కోడ్, మునిపల్లి, వట్‌పల్లి, సదాశివపేట్ తదితర మండలాల్లో కాస్త ముందుగానే వానాకాలం సీజన్ పనుల్లో రైతులు నిమగ్నమవుతుంటారు.
- ఈ ప్రాంతంలో ఎక్కువగా పత్తి సాగుచేసే రైతులు కాస్త ముందుగానే వానాకాలం పను లు ప్రారంభిస్తారు. మిగిలిన ప్రాంతాల్లో కొంచెం ఆలస్యమవుతుంది.

ముగిసిన కుంభమేళా



నదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

- గంగమ్మకు భక్తుల పూజలు
- పూర్ణాహుతిలో పీఠాధిపతులు
- చివరిరోజు పోటెత్తిన జనం



పంచవటి క్షేత్రంలో శారదాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న పీఠాధిపతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ మండలం రాఘవాపూర్–హుమ్నాపూర్ గ్రామంలో 12 రోజులుగా నిర్వహించిన (గరుడగంగ) కుంభమేళా శుక్రవారం ముగిసింది. చివరిరోజు భక్తులు భారీగా తరలివచ్చి మంజీరా నదిలో పుణ్యస్నానాలు చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా సరిహద్దులుగా ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. మంజీరా నదిలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు క్షేత్రం ఆవరణలో నిర్వహించిన యజ్ఞాలు, హోమాలు, తదితర పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం పంచవటి పుణ్యక్షేత్రం పీఠాధిపతి కాశీనాథ్‌బాబా ఆధ్వర్యంలో సాధువులు, సంతులు మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గంగపూజ చేసి మహా మంగళహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా కాశీనాథ్‌బాబా గంగానందిలో దీపాలు విడిచారు. అక్కడ సాధువు, సంతులు చేసిన విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గరుడగంగ కుంభమేళా ముగింపు వేడుకలకు కాశీ జగద్గురు శ్రీ చంద్రశేఖర శివాచార్య, బీచ్‌కుంద పీఠాధిపతి సామయప్ప స్వామి, బర్దిపూర్ ఆశ్రమానికి చెందిన అవదూతగిరి మహరాజ్ తదితర పీఠాధిపతులు హాజరయ్యారు. వారికి పంచవటి పీఠాధిపతి ఘన స్వాగతం పలికారు. వారితో కలిసి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పీఠాధిపతులు శారదాదేవి, సాయిబాబా, వేంకటేశ్వర స్వామి, సూర్యభగవానులకు పూజలు చేశారు. భక్తులకు అనుగ్రహ బాషణం చేశారు.

సమర్థవంతంగా ఆరోగ్య మహిళా కేంద్రాలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డిటౌన్: ఆరోగ్య మహిళా కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ వైద్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆరోగ్య మహిళ, కంటి వెలుగు, ధాన్యం కొనుగోళ్ల పురోగతి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతీ మంగళవారం జిల్లాలో ఏర్పాటు చేసిన నాలుగు ఆరోగ్య మహిళా కేంద్రాల ద్వారా వైద్యసేవలందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 2,849 మంది మహిళలకు వైద్యపరీక్షలు చేసినట్లు తెలిపారు. 18 ఏళ్లు పైబడినవారికి కంటి వెలుగు శిబిరాలలో కంటి పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలని వైద్యాధికారులకు సూచించారు. ఇప్పటి వరకు 10,01,266 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరగాలన్నారు. ధాన్యం కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీ దేవి, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ నరసింహారావు, సివిల్ సప్లయీస్ సంస్థ డీఎం సుగుణ బాయ్, పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత, డాక్టర్ శశాంక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబేర్ అలీ



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబేర్ అలీ

కొండాపూర్(సంగారెడ్డి): పదోన్నతులలో వెనుకబడ్డ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబేర్ అలీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డిలోని ఎస్టీయూ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వరంగంలో అనేక విభాగాలలో ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారందరికీ ఏటా పదోన్నతులు కల్పిస్తున్నారన్నారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా ఎంపికైన టీచర్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడుగానే, స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన ఉద్యోగి స్కూల్ అసిస్టెంట్‌గానే రిటైర్ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్రస్థాయి వజ్రోత్సవా సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి జీవన్ రాథోడ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్, ఆర్థిక కార్యదర్శి రమణకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్, సంగారెడ్డి మండల ప్రధాన కార్యదర్శి అలీ, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్ రాథోడ్, పటాన్‌చెరువు అధ్యక్షుడు సుందర్‌రావు, మునిపల్లి అధ్యక్షుడు ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు అభినందనలు



డీఈఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఈఓ కార్యాలయ సిబ్బంది

కొండాపూర్(సంగారెడ్డి): నూతన జిల్లా విద్యాధికారిగా ఎస్.వేంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఈఓ కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. రాష్ట్రంలో విద్యలో పురోగతి సాధించేందుకు కృషి చేస్తానని డీఈఓ తెలిపారు. డీఈఓను కలిసిన వారిలో ఏడీ విజయ, సైన్స్ అధికారి విజయ్‌కుమార్, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ వేంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల హక్కులు కాపాడాలి



సంగారెడ్డి మున్సిపాలిటీ: ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి వర్క్ లోడ్ కల్పించి ఉద్యోగుల హక్కులను కాపాడాలని ఓబీసీ ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటపల్లి పాండు అన్నారు. ఈ మేరకు శుక్రవారం కంది వద్ద ఓబీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రం కులగణన చేపట్టాలని, ఓబీసీకి మంత్రిత్వ శాఖ కేంద్రంలో ఏర్పాటు చేయాలన్నారు. వినతి పత్రం ఇచ్చినవారిలో అశోక్, ప్రభు, రాములు తదితరులు ఉన్నారు.

బుద్ధుడి బోధనలు దేశానికి అవసరం

మహానాడు జిల్లా అధ్యక్షుడు జనార్దన్



బుద్ధుడి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జనార్దన్

కొండాపూర్(సంగారెడ్డి): బుద్ధుడి బోధనలు దేశానికి అవసరమని, ఆయన చూపిన మార్గంలో అందరూ నడుచుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జనార్దన్ అన్నారు. బుద్ధ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని స్టడీ సర్కిల్‌లో గల బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనము చక్కగా బతకాలి అని చెప్పిన మహనీయుడు బుద్ధుడన్నారు. వేదాలు, శాస్త్రాలు, ఇతిహాసాలు ప్రామాణికము కాదని, కులాన్ని తెగించాడన్నారు. ప్రపంచంలో మొట్టమొదటి నైతిక తత్వవేత్తగా బుద్ధుడిని గుర్తించారని తెలిపారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ చైర్మన్ ప్రముఖ న్యాయవాది రామారావు, రిటైర్డ్ హెచ్‌ఎం విజయ రావు, బీజేపీ రాష్ట్ర నాయకుడు జగన్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్స్ పి.దుర్గాప్రసాద్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ ఇమ్మయ్య, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె రాజయ్య



విరిగిన విద్యుత్ స్తంభాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం జిల్లా కమిటీ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పాటు విద్యుత్ వైర్ల మరమ్మతులు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రాజయ్య అన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రైతుల పొలాల్లో ఉన్న నాలుగు విద్యుత్ స్తంభాలు కూలినా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. శుక్రవారం తెలంగాణ రైతు సంఘం నాయకులు ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంటు స్తంభాలు విరిగి 20 రోజులకు పైగా గడుస్తున్నా సరిచేసే వారు కరువయ్యారన్నారు. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి, నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు యాదవరెడ్డి రైతులు అబ్దుల్ ఖాదర్, లియాఖత్ అలీ, చంద్రశేఖర్, రఫీయోద్దిన్, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి

జిల్లా అధ్యక్షుడు కంబపురం అశోక్



మాట్లాడుతున్న కంబపురం అశోక్

నారాయణఖేడ్: రాష్ట్రంలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కంబపురం అశోక్ డిమాండ్ చేశారు. నారాయణఖేడ్ అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం సంఘం డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతపాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీర్చడానికి పదోన్నతులు, బదిలీలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, ఉపాధ్యక్షుడు కాశీనాథ్, జిల్లా, డివిజన్ బాధ్యులు ఏశప్ప, నర్సయ్య, హరిసింగ్, అంజయ్య, అప్పారావు, రాములు, హన్మండ్లు, విఠల్, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ‘మద్దతు’

డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొండపాక, సిర్సనగండ్ల, మర్పడ్గ, అంకిరెడ్డిపల్లి, బందారం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ ర్యాగల్ల సుగుణతో కలిసి ప్రారంభించారు. అకాల వర్షాలతో రంగు మారిన ధాన్యం కూడా కొంటామన్నారు. ఏగ్రేడ్ ధర క్వింటాల్‌కు రూ.2,060, కామన్ గ్రేడ్ ధర రూ.2,040 చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చిట్టి మాధురిరెడ్డి, గూడెపు లక్ష్మారెడ్డి, ఏమల్ల రజిత, బడేకోలు లావణ్య, గజ్వేల్లి రజిత, ఎంపీటీసీలు పత్తి ఆంజనేయులు, నందాల శ్రీనివాస్, డైరెక్టర్లు కృష్ణ, మల్లేశం, ఉపసర్పంచ్ రమేశ్, మాజీ ఎంపీపీ రాధాకిషన్‌రెడ్డి, లీడర్లు భూపతిరెడ్డి, చెంది మల్లికార్జున్, గోవర్ధన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రవీందర్, రేపాక స్వామి తదితరులు పాల్గొన్నారు.

బాల్కీ.. ముఖాముఖి

- అసెంబ్లీ సెగ్మెంట్‌లో కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ
- విజయావకాశాలు నగం నగం
- జేడీఎస్ పోరు నామమాత్రమే



ఈశ్వర్‌ఖండ్రే, కాంగ్రెస్



ప్రకాశ్‌ఖండ్రే, బీజేపీ



రవూఫ్‌పటేల్, జేడీఎస్

జహీరాబాద్: జహీరాబాద్ సమీప కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా పరిధి బాల్కీ అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నిక రసవత్తరంగా మారింది. కాంగ్రెస్ పార్టీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ఈశ్వర్‌ఖండ్రే బరిలో ఉన్నారు. ఆయన వరుసగా 2008, 2013, 2018 ఎన్నికల్లో విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. ఈ ఎన్నికల్లో సైతం విజయం సాధించేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. బీజేపీ నుంచి పోటీ చేస్తున్న ప్రకాశ్‌ఖండ్రే ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని పట్టుదలతో ప్రచారం చేస్తున్నారు. తనకు ఉన్న అవకాశాలన్నింటిని సానుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. గత ఎన్నికల్లో ప్రకాశ్‌ఖండ్రే జేడీఎస్ తరపున పోటీ చేసి 15 వేల ఓట్లు సాధించాడు. గత ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన సిద్రాంకు 63,235 ఓట్లు రాగా, కాంగ్రెస్ నుంచి పోటీచేసిన ఈశ్వర్‌ఖండ్రేకు 84,673 ఓట్లు లభించాయి. సిద్రాంకు ఈమారు బీజేపీ టికెట్ లభించలేదు. జేడీఎస్ నుంచి బీజేపీలో చేరిన ప్రకాష్‌ఖండ్రే టికెట్ దక్కించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న ఈశ్వర్‌ఖండ్రే తండ్రి భీమన్న ఖండ్రే 1962, 1967, 1978, 1983 ఎన్నికల్లో విజయం సాధించాడు. ఈశ్వర్ ఖండ్రే సోదరుడు విజయ్‌ఖండ్రే 1989, 1994 ఎన్నికల్లో గెలుపొందాడు. దీంతో వీరి కుటుంబమే అత్యధికసార్లు విజయం వరించింది. బీజేపీ నుంచి పోటీ చేస్తున్న ప్రకాష్ ఖండ్రే 1999, 2004 ఎన్నికల్లో బీజేపీ తరపున గెలుపొందారు. మరోమారు పాగే వేసేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ప్రకాశ్‌ఖండ్రే వరుసగా ఐదు పర్యాయాలు ఓటమి పాలయ్యారు. ఇక జేడీఎస్ తరపున రవూఫ్‌పటేల్ బరిలోకి దిగారు. అయినా జేడీఎస్ పోటీ నామ మాత్రంగానే ఉందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీకి సంగం సగం విజయావకాశాలుంటాయనే ప్రచారం సాగుతోంది.

మొత్తం ఓటర్లు:		2,29,046
పురుషులు	:	1,17,888
మహిళలు	:	1,08,158
ఇతరులు	:	03

ఎవరికి టికెట్ ఇచ్చినా పనిచేయాలని ఒప్పందం

ఈ ఎన్నికల్లో బీజేపీ తరపున ఎవరికి టికెట్ ఇచ్చినా అంతా ఐకమత్యంగా పనిచేసి గెలిపించుకోవాలని పార్టీ నేతలు ఒప్పందం చేసుకున్నారు. వీరిలో గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన సిద్రాం కూడా ఉన్నారు. బీజేపీ తరపున పది మంది ఆశావహులు ఉండటంతో కేంద్ర మంత్రి భగవంత్ కుబా అందరితో చర్చలు జరిపారు. దీంతో అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా అంతా కలిసి పనిచేయాలని ఒప్పందానికి వచ్చారు. దీంతో ప్రకాష్ ఖండ్రేకు టికెట్ లభించింది. ఇతడి విజయం కోసం సిద్రాంతో పాటు పార్టీ నేతలంతా ఏకమై పనిచేస్తున్నారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ అభ్యర్థి ఈశ్వర్‌ఖండ్రే రాహుల్‌గాంధీ ప్రచారంతో నామినేషన్ దాఖలు చేసి ప్రచారం చేపట్టారు.

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నట్టు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 12 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించగా, మరో ఇద్దరికి రూ. 5 వేలు జరిమానా విధించారన్నారు.

సిద్దిపేటలో...

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ప్రధాన చౌరస్తాల్లో మూడు రోజుల క్రితం తమ సిబ్బందితో కలిసి డ్రంకెన్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించగా నలుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.9,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఎల్లమ్మ ఆలయాల్లో చోరీ


గోవిందాపూర్ ఎల్లమ్మ ఆలయ హుండీ

దుబ్బాక: దౌల్తాబాద్ మండలంలోని గోవిందాపూర్, కోనాయిపల్లి గ్రామాల్లోని ఎల్లమ్మ ఆలయాల్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. హుండీలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని డబ్బు, వస్తువులను ఎత్తుకెళ్లారు.

వ్యక్తి ఆత్మహత్య

జిన్నారం(పటాన్‌చెరు): ఉరివేసుకొని ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. సీఐ సురేందర్‌రెడ్డి కథనం ప్రకారం..మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామానికి చెందిన చింతకింది సహదేవ్(36) మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం గ్రామ శివారులోని ఓ చెట్టుకు సహదేవ్ మృతదేహం వేలాడుతుండడం స్థానికులు గుర్తించారు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి ఫొటో స్టేటస్ పెట్టిన సర్పంచ్‌పై కేసు

మనోహరాబాద్(తూప్రాన్): ఓ గ్రామ సర్పంచ్.. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడి భార్య ఫొటోను వాట్సాప్‌లో స్టేటస్ పెట్టుకున్నాడు. దీంతో పిల్లలను భర్త వద్దే వదిలేసి ఆమె తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో భర్త ఫిర్యాదు చేయగా, సర్పంచ్‌పై కేసు నమోదైంది. మండల పరిధిలోని రంగాయపల్లి గ్రామ సర్పంచ్ నాగభూషణం రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఓ యువకుడి భార్య ఫొటోను స్టేటస్‌గా పెట్టి దాని కింద ఐలవ్ యూ అని టెక్స్ కంపోజ్ చేశాడు. ఊరంతా దీనిపై చర్చ జరిగింది. దీంతో ఆమె భర్త మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. 67'ఏ, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపాడు.

ముగ్గురి ప్రాణం తీసిన ఓవర్‌టేక్

- లారీని దాటే క్రమంలో ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రాలీ ఆటో
- అక్కడికక్కడే దంపతుల మృతి
- చికిత్స పొందుతున్న కూతురు మృతి, విషమంగానే తల్లి ఆరోగ్యం
- ఏడుపాయల నుంచి తిరిగివస్తుండగా ఘటన


ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రాలీ ఆటో, (ఇన్‌సెట్) నాగలింగరాజు, రమ మృతదేహాలు

కౌడిపల్లి(నర్సాపూర్): ఓవర్ టేక్ ముగ్గురి ప్రాణం తీయగా, మరో ఐదుగురిని గాయాలపాలు చేసింది. దైవదర్శనం చేసుకుని సంతోషంగా తిరిగి వస్తుండగా, పెను విషాదం చోటుచేసుకుంది. ఆటోడ్రైవర్ కుటుంబం చిన్నాభిన్నమైంది. తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..జీడిమెట్ల సూరారం సాయిబాబానగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ సప్పిడి నాగలింగరాజు(36), అతని భార్య రమ(33) వీరి పిల్లలు ధరణి, వెంకటలక్ష్మి, అమృతతోపాటు పక్కింటి బత్తిని లత, ఆమె కూతుళ్లు వైశాలి, అవంతిక ట్రాలీ ఆటోలో గురు వారం ఏడుపాయల వనదుర్గ ఆలయానికి వచ్చారు. రాత్రి అక్కడే ఉండి శుక్రవారం మధ్యాహ్నం తిరుగుప్రయాణం అయ్యారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం మహ్మద్‌నగర్‌గేట్ సమీపంలోకి రాగానే ఆటో నడుపుతున్న నాగలింగరాజు ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నం చేశాడు. ఎదురుగా మెదక్ డిపోనకు చెందిన పల్లెవెలుగు బస్సు నర్సాపూర్ నుంచి మెదక్‌వైపు వస్తుండగా, ఆటో బస్సును ఢీకొట్టింది. దీంతో ఆటోడ్రైవర్ నాగలింగరాజు, అతని భార్య రమకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతి చెందారు. వీరి పిల్లలు ధరణి, వెంకటలక్ష్మి, అమృతతోపాటు పక్కింటి బత్తిని లత, ఆమె కూతుళ్లు వైశాలి, అవంతికకు కూడా గాయాలయ్యాయి. అయితే వీరిలో బత్తిని లత, ఆమె కూతురు వైశాలి పరిస్థితి విషమంగా ఉండగా, హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ వైశాలి(16) మృతిచెందింది.

జేసీబీ సాయంతో మృతదేహం వెలికితీత

ఆర్టీసీ బస్సును వేగంగా ఢీకొనడంతో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. అందులోనే ఆటో డ్రైవర్ నాగలింగరాజు మృతదేహం ఇరుక్కుపోయింది. సంఘటన స్థలాన్ని తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, నర్సాపూర్ సీఐ షేక్‌లాల్ మదార్, ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి సందర్శించారు. మృతదేహాన్ని జేసీబీ సాయంతో ఆటోలో నుంచి బయటకు తీశారు. అనంతరం మృతదేహాలను నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

108లో బాధితుల తరలింపు

ప్రమాదం జరిగిన సమయంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, హరిచంద్‌తండా సర్పంచ్ లక్యానాయక్, రాజిపేట మాజీ సర్పంచ్ పాష ఇతర నాయకులు అటుగా వెళుతున్నారు. వెంటనే వారు గాయపడిన బాధితులను ఆటోలో నుంచి దించి 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాద వివరాలు తెలుసుకున్న సునీతారెడ్డి

అటుగా వెళుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి డీఎస్పీని అడిగి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



వైశాలి (ఫైల్), గాయపడిన ఆమె తల్లి బత్తిని లత


ముగ్గురు కూతుళ్లతో నాగలింగరాజు, రమ(ఫైల్)

ఊరు వదల్లేక.. ఉసురు తీసుకున్నాడా..?


మేడబోయిన వెంకటయ్య(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: పుట్టి పెరిగిన ఊరుతో 90 ఏళ్ల అనుబంధం...కట్టుకున్న భార్య చనిపోయి 30 ఏళ్లయినా కుంగిపోలేదు. కొడుకులు, కూతురు పెళ్లి చేశాడు...ఆస్తులూ పంచి ఇచ్చాడు. పెద్దకొడుకంటే ప్రేమ ఎక్కువ. 30 ఏళ్లుగా ఆయన వద్దే ఉంటున్నాడు. మిగతా కొడుకులు పెద్ద మనుషుల వద్ద పంచాయితీ పెట్టారు. దీంతో వారు వంతులవారీగా నెల నెలా ఒక్కో కొడుకు ఇంటివద్ద ఉండేలా తీర్పు చెప్పారు. దీంతో ఏడాదికాలంగా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన మేడబోయిన వెంకటయ్య (90) కొడుకుల ఇల్లిల్లూ తిరుగుతూ ఉన్నాడు. వెంకటయ్యకు నలుగురు కొడుకులు కాగా, పెద్ద, రెండో కొడుకు సొంతూరైన పొట్లపల్లిలో ఉంటున్నారు. మూడో కొడుకు హుస్నాబాద్‌లో, నాలుగో కొడుకు కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని నవాబుపేటలో ఉంటున్నాడు. వంతులో భాగంగా నాలుగో కొడుకు ఉంటున్న నవాబుపేటకు వెంకటయ్య వెళ్లాల్సి ఉంది. బుధవారం పొట్లపల్లి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న నవాబుపేటకు వైపునకు వెళ్లాడు. నాలుగిళ్లు తిరిగే ఈ జీవితం ఎందుకు అనుకున్నాడో ఏమో, ఉన్న ఊరు మీద మమకారం చంపుకోలేకపోయాడో.. తన మనసులో మాట కొడుకులకు చెప్పలేకపోయాడో తెలియదు కానీ తాటి కమ్మలను పోగు చేశాడు. వెంకటయ్యకు బీడీ తాగే అలవాటు ఉంది. మంట కాచుకొని అక్కడే నిద్రకు ఉపక్రమించి ప్రమాదవశాత్తు చనిపోయాడా..? జీవితంపై విరక్తి చెంది తాటి కమ్మల మంటల్లో తలపెట్టాడేమో తెలియదు కానీ గురువారం శవమై కనిపించాడు. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం వెంకటయ్య మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. సగం కాలిన వెంకటయ్య మృతదేహాన్ని తమ వ్యవసాయ భూముల వద్ద పూర్తిగా దహనం చేసి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఏదిఏమైనా వెంకటయ్య మరణం చుట్టు పక్కల గ్రామాల ప్రజలను కన్నీరు పెట్టిస్తోంది.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

పురుగుల మందు తాగి ఒకరు... రోడ్డుప్రమాదంలో గాయపడిన మరొకరు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు.


శ్రీరామ్ ఆంజనేయులు(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన శ్రీరామ్ ఆంజనేయులు(30) గత నెల 30న చిన్నశంకరంపేట మండలంలోని టి.మాందాపూర్ వద్ద మరో వ్యక్తితో కలిసి స్కూటీపై వెళుతుండగా, కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆంజనేయులును గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య మీనాకుమారి, ఇద్దరు కుమారులు చరణ్, నిషాంత్ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన రోషినిదేవేంద్ర(30) మతిస్థిమితం సరిగ్గా నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగింది. ఆస్పత్రికి తరలిచంగా, చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న రజక సంఘం మండలాధ్యక్షుడు ఏల్లేష్ శుక్రవారం, ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. బాల్ నర్సయ్య, యాదగిరి, నర్సింలు పాల్గొన్నారు.

ఆ పశువులు ఏమయ్యాయి?

- గోశాల లేదని ధ్రువీకరించిన కార్యదర్శి
- పోలీసులు ఎవరికి అప్పగించారు ?

సిద్దిపేటరూరల్: అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకొని గోశాలకు తరలించామని ఓ వైపు పోలీసులు చెబుతున్నారు..మరోవైపు అసలు ఆ ఊరిలో గోశాలనే లేదని గ్రామ కార్యదర్శి ధ్రువీకరిస్తున్నాడు. ఇంతకీ ఆ పశువులు ఏమయ్యాయనే దానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- గత నెల 24వ తేదీన సాయంత్రం అక్రమంగా తరలిస్తుండగా, 15 పశువులను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం పోలీసులు ఇర్కోడ్‌లోని శ్రీ కృష్ణసాయి గోశాలలోని కాపలాదారుడికి అప్పగించారు.
- 27వ తేదీ వరకు పశువులను మేపి రాత్రి 9 గంటల సమయంలో ఆ కాపలాదారుడు ఇంటికి వచ్చాడు.
- మరునాడు ఉదయం గోశాల వద్దకు వెళ్లిచూడగా..అవి కనిపించలేదు. దీంతో పశువులను దొంగిలించాడని ఓ వ్యక్తిని అనుమానిస్తూ 28వ తేదీన రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కాపలాదారుడు నాగరాజు ఫిర్యాదు చేశాడు.
- ఇదిలా ఉండగా మే 1వ తేదీన ఇర్కోడ్‌లోని గోశాలలో ఉన్న 15 పశువులు అనారోగ్యంతో ఉన్నాయని, వాటికి వైద్యం చేయాలంటూ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ తోర్నాల పశువైద్యాధికారి చందనకు నోటీసు ద్వారా తెలిపారు.
- మే 2వ తేదీన కాపలాదారుడు పశువులను బుస్సాపూర్‌లోని స్కూల్‌లో మేపుతుండగా వాటిని పరీక్షించి డాక్టర్ చందన వైద్యం చేశారు.

ఆ పశువులు బలహీనంగా ఉన్నాయి.

ఈ విషయమైన చందనను సాక్షి వివరణ కోరగా.. పోలీస్‌స్టేషన్ నుంచి సమాచారం వచ్చిన మరుసటి రోజే బుస్సాపూర్ వెళ్లాను. అప్పటికే పశువులు డీహైడ్రేషన్‌కు గురయ్యాయి. చాలా బలహీనంగా ఉన్నాయి. వాటికి వైద్యం చేసి వచ్చాను. 4వ తేదీన రాత్రి ఒక ఆవు చనిపోయినట్టు సమాచారం అందిందని' ఆమె చెప్పింది.

ఇర్కోడ్‌లో గోశాల లేదు..

ఇర్కోడ్‌లో శ్రీకృష్ణ సాయి గోశాల లేదని గ్రామ పంచాయతీ కార్యదర్శి జీవన్‌రెడ్డి ధ్రువీకరించారు. అసలు పోలీసులు ఇర్కోడ్‌లో లేని గోశాల ఎలా పశువులను అందించారు? ఈ కాపలాదారుడు ఎవరు? అసలు పశువులకు బదులు, అక్కడ బలహీనమైన పశువులు ఎలా వచ్చాయి? అన్న ప్రశ్నలపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

నాగరాజుకు అప్పగించాం

గత నెల 24వ తేదీన పట్టుకున్న పశువులను బుస్సాపూర్ గ్రామానికి చెందిన సోము నాగరాజుకు చెందిన తాత్కాలిక గోశాలలో అప్పగించాం. ఆ తర్వాత అతనే పశువులను అమ్ముకున్నాడని తెలిసింది. ఈవిషయం బయటకు రాగానే అమ్మిన వ్యక్తి కొన్న వ్యక్తితో కలిసి అసలు వాటికి బదులు వేరే పశువులను తీసుకొచ్చాడు. దీనికి నాగరాజే కారణమని బజరంగ్‌దళ్ చెందిన వారు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాగరాజు వివరాలు సేకరిస్తున్నాం. దోషులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

– భానుప్రకాశ్, త్రీటౌన్ సీఐ

వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.


గాయపడిన గన్యా

చిలప్‌చెడ్(నర్సాపూర్): కౌడిపల్లి మండలం ధనూజతండాకు చెందిన నునావత్ గన్యా జోగిపేట నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుతున్నాడు. చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ వద్ద మెదక్–జోగిపేట ప్రధాన రహదారిపై డాకూర్‌కు చెందిన అనిల్ కారులో వేగంగా వస్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గన్యాకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జోగిపేట ఆస్పత్రికి తరలించారు.

శివ్వంపేట(నర్సాపూర్): ధాన్యం కుప్పను ఢీకొట్టిన ఘటనలో ఒకరు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ మండలం జండాపల్లికి చెందిన నాగరాజుయాదవ్ బైక్‌పై వెళుతున్నాడు. తూప్రాన్– వెల్దుర్తి ప్రధాన రోడ్డుపై దంతన్‌పల్లి వద్ద ధాన్యం కల్లాలు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి సమయంలో ధా న్యం కుప్పలుగా చేసి రోడ్డుపై ఉంచారు. కుప్ప ను ఢీకొని బైక్ అదుపు తప్పడంతో నాగరాజు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు.

దొంగ రిమాండ్

మెదక్ మున్సిపాలిటీ: మహిళ మెడలోంచి పుస్తెల తాడు దొంగతనం చేసిన వ్యక్తిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్టు పట్టణ సీఐ సంజయ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నశంకరంపేట మండలం చందాయిపేట గ్రామానికి చెందిన పడాల కౌసల్య మెదక్ ఎంసీహెచ్ ఆస్పత్రి వద్దకు వచ్చారు. ఈ క్రమంలో మాసాయిపేట వెంకటరాములు శుక్రవారం తెల్లవారు జామున 6గంటల ప్రాంతంలో కౌసల్య మెడలోంచి పుస్తెలతాడు దొంగతనం చేయగా, అతడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి మూడున్నర తులాల బంగారం రికవరీ చేశారు.

మామను హత్య చేసిన కేసులో అల్లుడికి జీవిత ఖైదు

పటాన్‌చెరు టౌన్: మామను హత్య చేసిన కేసులో అల్లుడికి జీవిత ఖైదు పడింది. బీడీఎల్ సీఐ వినాయక రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామానికి చెందిన ఖాజామీయా కూతురు బిపాసాను రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన ఫకీర్ అలియాస్ సత్తార్‌కి ఇచ్చి వివాహం చేశారు. సత్తార్ మద్యానికి బానిసై భార్య బిపాసాను తరచు వేధిస్తుండటంతో గత ఏడాది మార్చి నెలలో ఆమె పుట్టిల్లయిన నందిగామకు వచ్చింది. అయితే సత్తార్ కూడా అత్తగారి ఇంటికి వచ్చి అక్కడే ఉంటూ పటాన్‌చెరు మండలం కర్దనూరు సమీపంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసేవాడు. గత ఏడాది మే 18 తేదీన సత్తార్ తన భార్య బిపాసాను కొట్టగా, ఆమె గ్రామ పెద్దలకు చెప్పేందుకు గ్రామపంచాయతీకి వెళ్లింది. ఈ క్రమంలో ఇంటి వద్ద ఉన్న మామ ఖాజామియా(75)ను అల్లుడు సత్తార్ కూరగాయలు కోసే కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. బయటకు వెళ్లిన కూతురు ఇంటికి వచ్చి చూసేసరికి తండ్రి రక్తపు మడుగులో ఉన్నాడు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన భర్తపై ఫిర్యాదు చేసింది. దర్యాప్తులో భాగంగా సత్తార్‌ను జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి ముందు హాజరుపరిచారు. శుక్రవారం పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్‌రెడ్డి వాదోపవాదాల అనంతరం సత్తార్‌కు జీవితఖైదుతో పాటు రూ.500 జరిమానా విధించినట్టు పోలీసులు తెలిపారు. గతంలో సత్తార్‌పై రంగారెడ్డి జిల్లా మేడిపల్లిలో ఐదేళ్ల బాలుడి హత్య కేసులో అభియోగం మోపగా, హైకోర్టుని ఆశ్రయించాడు. దీంతో హైకోర్టు ఆ కేసును కొట్టేసింది.

సీసీ ఫుటేజీ చెక్ చేసి... నగదు ఉన్న బ్యాగ్ అప్పగించి


నారాయణఖేడ్: సంగీతకు పోగొట్టుకున్న నగదును అందజేస్తున్న ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి

నారాయణఖేడ్: పట్టణంలో ఓ మహిళ రూ.40వేల నగదుతోపాటు ఇతర వస్తువులు ఉన్న బ్యాగును పోగొట్టుకుంది. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు బ్యాగును గుర్తించి బాధితురాలికి అప్పగించారు. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం బైరాన్‌దిబ్బ గ్రామానికి చెందిన మడపతి సంగీత తన తల్లిగారి గ్రామమైన న్యాల్‌కల్ మండలం హుమ్నాపూర్ వెళ్లేందుకు శుక్రవారం నారాయణఖేడ్ రాజీవ్‌చౌక్‌లో బస్సు దిగింది. ఓ చోట బ్యాగును పక్కనపెట్టి కూర్చుంది. కొద్దిసేపటి తర్వాత చూస్తే బ్యాగు కనిపించలేదు. అందులో రూ.40వేల నగదుతోపాటు చీరలు, ఇతర వస్తువులు ఉండడంతో ఆమె ఆందోళనకు గురైంది. అక్కడ పెట్రోలింగ్ విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు బ్యాగు పోయిన విషయాన్ని చెప్పింది. వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీసీఫుటేజీని పరిశీలించగా ఆమె బ్యాగు పెట్టిన చోటకు కొంత దూరంలో బ్యాగు పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బ్యాగులో ఉన్న నగదు, ఇతర వివరాలు బాధితురాలు సరిగ్గానే చెపపడంతో బ్యాగు ఆమెదిగానే నిర్ధారించుకుని బ్యాగుతోపాటు అందులోని నగదును ఎస్‌ఐ అందజేశారు.

ట్రాలీ ఆటోను ఢీకొన్న ఇన్నోవా

పదిమంది కూలీలకు గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న ఇన్నోవా ఇదే

తూప్రాన్: ట్రాలీ ఆటోను ఇన్నోవా ఢీకొన్న ఘటనలో 10 మంది కూలీలకు గాయపడ్డారు. ఎస్‌ఐ సురేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యావపూర్ గ్రామానికి చెందిన మహిళలు మనోహరాబాద్ మండలంపాలాట గ్రామంలోని ఓ సీడ్ పరిశ్రమలో కూలీలుగా పని చేస్తున్నారు. రోజు మాదిరిగా పని ముగించుకొని ట్రాలీ ఆటోలో ఇంటికి వస్తున్నారు. వీరి ఆటో 44వ జాతీయ రహదారిపై కరీంగూడ చౌరస్తా వద్ద రహదారిపై మలుపు తిరుగుతున్న సమయంలో నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపునకు వెళుతున్న ఇన్నోవా అతి వేగంగా వచ్చి ట్రాలీ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో యావపూర్ గ్రామానికి చెందిన 10 మంది మహిళ కూలీలకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో అనురాధ, రేణుక, వరలక్ష్మి, పద్మ, చాంద్‌బీ, పుష్ప, మీన, మమత, ఫారినాబేగం, బాలమణి ఉన్నారు. కాగా నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళుతున్న ఇన్నోవాపై ప్రభుత్వ వాహనం అని రాసి ఉంది. అయితే ఇన్నోవాలోని ఎయిర్ బ్యాగ్‌లు తెరుచుకోవడంతో ప్రాణనష్టం తప్పింది. అందులో నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ తల్లిదండ్రులు ఉన్నట్టు సమాచారం. వారు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వారిని పోలీసులు మరో వాహనంలో హైదరాబాద్ పంపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనా స్థలంలో గాయపడి రోదిస్తున్న మహిళా కూలీలు


క్షతగాత్రులకు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

సరిహద్దులో రెండంచెల తనిఖీలు

- కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల ఏర్పాటు
- ఎక్సైజ్ సిబ్బంది, పోలీసుల తనిఖీలు


65వ నంబరు జాతీయ రహదారి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు

జహీరాబాద్: కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దులో ఇరు రాష్ట్రాలకు చెందిన ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖలు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాయి. దీంతో రెండంచెల తనిఖీలు జరుగుతున్నాయి. చెక్‌పోస్టులను ఎప్పటికప్పుడు ఆయా శాఖల ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే సంగారెడ్డి ఎస్పీ రమణ్‌సింగ్ ఆయా చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. కర్ణాటక పోలీసు ఉన్నతాధికారులతో సైతం సమావేశమై చేపట్టాల్సిన చర్యలు, నిఘా విషయమై చర్చించారు. ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరికిషన్ కూడా తనిఖీ చేశారు. కర్ణాటక పరిధిలోని చెక్‌పోస్టులను బీదర్ ఎస్పీ చెన్న బసవన్న, కలెక్టర్ గోవింద్‌రెడ్డిలు తనిఖీ చేస్తున్నారు. దీంతో చెక్‌పోస్టుల వద్ద భద్రత కట్టుదిట్టంగా సాగుతోంది. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వదిలి పెడుతున్నారు. తెలంగాణ నుంచి కర్ణాటకలోకి అక్రమంగా మద్యం, డబ్బు తరలకుండా నిఘా ఉంచారు.

రాష్ట్ర సరిహద్దుల్లో 13 చోట్ల చెక్‌పోస్టులు

రాష్ట్ర సరిహద్దుల్లోని 13 చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సంగారెడ్డి జిల్లా పరిధిలోని చిరాగ్‌పల్లి, మాడ్గి, మనియార్‌పల్లి, గౌసాబాద్, బూచనెల్లి, మాడ్గి, హుస్సేనగర్, డప్పూర్, కల్బేమల్, శాపూర్ జంక్షన్, డేగుల్‌వాడి, కసర్‌గుత్తి, హుసెల్లి ప్రాంతాల్లో తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఎక్సైజ్, పోలీసు శాఖలు సంయుక్తంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నాయి. అక్రమంగా మద్యం తరలకుండా ఎక్సైజ్ పోలీసులు, అక్రమంగా డబ్బు తరలకుండా పోలీసు శాఖలు గట్టి నిఘా పెట్టాయి. కర్ణాటక పరిధిలో సైతం ఆయా శాఖల అధికారులు ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. 65వ జాతీయ రహదారిపై బొంగూరు వద్ద ప్రధాన చెక్‌పోస్టు ఏర్పాటు చేసి నిఘా ఉంచాయి. చెక్‌పోస్టుల వద్ద రాత్రింబవళ్లు తనిఖీలు నిర్వహించిన అనంతరమే వాహనాలను లోపలకు వెళ్లేందుకు అనుమతిస్తున్నారు.


బీదర్ రహదారిపై ఉన్న చెక్‌పోస్టును సందర్శించిన ఎస్పీ రమణకుమార్(ఫైల్)